కథానిక

# అంతా వాడి నిర్ణయం!

"సుబ్బన్న"

రెండో భార్య పోయినతర్వాత శాస్త్రిగారు మళ్లీ పెళ్ళిసంగతి ఎత్తుకో దలచలేదు. తద్దినాలు పెట్టించీ, దానాలుపట్టీ పదిరాళ్లు కూడబెట్టారు. ఈడొచ్చిన కూతురు వండిపెడుతుంటే 'కృష్ణా' 'రామా' అనుకొంటూ తనకు తెలిసిన నాలుగు గోసాయి చిటకాలతో వైద్యంపేరిట మరికొంత గుంజుతూనే ఉన్నారు. అలా జరిగిపోతేబాగానే ఉండేది.

ఈడేరిన కూతుర్ని ఎన్నాళ్ళని ఇంట్లో వుంచుకొంటారు? ఇరుగుపొరుగుల పోరు ఎక్కువైంది. పరుల బాధ పడలేక కూతురి మెళ్ళో మూడు ముళ్లు వేయించారు.

కూతురు కాపరానికి వెళ్లింది. శాస్త్రిగారికి చెయి కాల్చుకోవాల్సొచ్చింది. ఒక రోజా, రెండు రోజులా? ఎంతకాలమని సరిపెట్టుకు పోతారు?

సాయంకాలమే నాలుగు గింజలు వుడకేసుకొని సంభావనల కోసం చక్కాపోయినారు శాస్త్రిగారు. రాత్రి పది గంటలకు గాని తిరిగి రావడమవలేదు. సంభావన విషయంలో ఘనాపాటీల దగ్గర తగాదా వచ్చింది. ఆ సందర్భంలో ఎక్కువగా నోరు చేసుకొన్నది శాస్త్రిగారే. అందువల్ల బాగా ఆకలివేస్తున్నది. కూరా నారా ఏమీ లేకపోయినా కూతురి పుణ్యమా అంటూ ఆ సంవత్సరానికి సరిపోయే ఊరగాయలున్నై.

ఎలాగైనా ఇంత లోపలికి పోతేగాని ప్రాణం కుదుటపడేటట్టు లేదు.

వంటయింట్లోకి అడుగు పెట్టారో లేదో 'జర్రున' కాలు జారింది. అరవయ్యో పడిలో పడ్డ శాస్త్రిగారి నడుం కలుక్కుమన్నది. ఉట్టిమీది మజ్జిగ గిన్నె క్రిందపడి ఇల్లంతా మడుగు కట్టింది.

నడుంచుట్టూ కాస్త పేరిన నెయ్యి రాచి శాస్త్రిగారు మెల్లిగా ఇల్లు తుడిచారు. పిడిమెతుకులైనా రెండు లోపలికి పంపుదామని శాస్త్రిగారు అన్నపు గిన్నెమీది మూతతీశారు. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డది. అన్నంనిండా చీమలపుట్టలు.

మెల్లిగా లేచి చేతులు కడుక్కున్నారు. తలుపు గడియవేసి దొడ్డి వసారాలో నులకమంచంమీదకి శాస్త్రిగారు శరీరాన్ని చేరవేసేసరికి రాత్రి పదకొండు గంటలు కొట్టింది.

ఆకటిబాధ, ఆపైన నడుంనొప్పి. కోపమైతే తీవ్రంగానే వచ్చేసింది. కాని ఎవరిమీద చూపుతారు?

కూతుర్ని అప్పుడే అత్తవారింటికి పంపడం పొరపాటనుకొన్నాడు. పంపకపోతే ఎట్లాగని సరిపెట్టుకొని వడ్డిగిల్లారు. నిద్రపట్టలేదు.

బావిప్రక్కన కూతురు పెంచిన సన్నజాజి విరియపూసింది. శరత్కాలపు వెన్నెల జల్లుకు జాజిపూలు పులకరించి కిలకిల మన్నాయి. నస్యపుఘాటుకు అలవాటుపడ్డ నాసిక జాజిపూల ఘుమాయింపుకు తట్టుకొన్నది. వెన్నెల తఢాకాకు తట్టుకోవడం శాస్త్రిగారికి కష్టమైపోయింది. గోడవైపు తిరిగి కాళ్ళను పొట్టలోకి లాక్కొని ముడుచుకు పడుకోవాలనుకొన్నారు. కలకబారిన నడుం అందుకు ఒప్పుకోలేదు.

శాస్త్రిగారు ఆలోచనలో పడ్డారు. అసలు వారెందుకు బాధపడాలి?

తల దాచుకోడానికి ఇల్లువాకిలి ఉంది. చచ్చిన పెద్దలు ఏడాదికోమాటు తిండి తింటారనే నమ్మకం ప్రజల్లో పాతుకుపోయింది గనుక పౌరోహిత్యానికి వచ్చిన ఫరవాలేదు. తనకా ఇంకా పళ్లు గట్టిగానే ఉన్నాయి. తగ్గిపోయిన చూపు తిరిగి వచ్చింది. ఇన్ని ఉండీ తానెందుకు ఊరుకోవాలి? ఆలోచించుకొంటూ నిద్రపోయి

నారు. కళ్లు తెరిచేసరికి తెల్లవారింది.

పరమేశ్వరుడు తనకా కోరిక కలిగించాడనీ, ఈశ్వరేచ్ఛకు ప్రతికూలంగా ప్రవర్తించడం న్యాయంకాదనీ, కర్తవ్యం నెరవేర్చుకొనే ప్రయత్నంలో ఉన్నాననీ, తనకు తెలిసిన నలుగురి చెవినా వేశారు శాస్త్రుల్లుగారు. భగవంతుడిమీద భారంవేసి తన ప్రయత్న లోపంలేకుండా తగిన సంబంధంకోసం చూస్తున్నారు.

దాని ఘుడియ రావాలిగాని ఎవరాపుతారు? భగవత్ కరుణాకటాక్షం శాస్త్రిగారిమీద పూర్తిగా ప్రసరించింది. వారి ప్రయత్నం ఫలించింది. మళ్ళీ వారి కొంగిత ఉన్నది. నూటికి పన్నెండుమందికి మాత్రమే అక్షరాలు వచ్చిన నేటి సమాజంలో కాదనేవా రెవరు?

ఐతే శాస్త్రిగారు కొంచెం ఖర్చు పెట్టాలిసొచ్చింది. లోకంలో చాలామంది డబ్బుకోసమే డబ్బుని గ్రహించారు గనుక ఓలీ ఇవ్వడానికి ఇట్టే ఒప్పుకొన్నారు. అట్లాంటివారికి అదో పట్టింపుగాదు.

పెద్దలంతా నడుం గట్టుకొని ఆ కాస్తా ఆయిందనిపించారు.

* * *

"చెంపక్రింది ఆపుట్టుమచ్చ ఎంత అందంగా ఉందీ! నా అదృష్టం కొద్దీ దబ్బపండులాంటి పిల్ల దొరికింది. గుణవతి శీలవతి రూపవతీని! అంతా ఆ పరమేశ్వరానుగ్రహం లెండి."

"ఏనాడో రాసి పెట్టిఉంది. ఇంగ్లీషువాళ్ళు ఒప్పుకోరుగాని, భార్య అంటే-జన్మజన్మాంతర సంబంధం అనుకోండి. ఇది ఋషులు నిర్ణయించిన శాస్త్రమూ మరేమన్నానా?"

"మీ మేలు మరువను. ప్రస్తుతం ఐదువందలు తీసుకోండి."

"ఆహాఁ, దానికేం లెండి. నన్ను నేను పొగుడుకోగూడదు కాని, మీరు నన్ను మరిచిపోలేరంటే నమ్మండి. ఏదో జరక్క ఈడబ్బుకు కక్కుర్తి."

"ఎంతమాట! దానికేం లెండి. మీ మేలు మరవను, మిమ్మల్నీ మరవను. ఆ భగవంతుడేదో చిన్నచూపు చూశాడుగాని లేకపోతే మీలాంటి పరోపకారులకు ఆ కాలు, మాత్రం ఎందు కుండాలి చెప్పండి? అంతా."

"వాడి నిర్ణయం. సెలవు శాస్త్రిగారూ" అంటూ కుంటికాలి పెద్దమనిషి డబ్బు తీసుకు చక్కా పోయినాడు.

* * *

"సుందరీ! అప్సరసలాంటి నీ రూపు, రూపుకు తగినచూపు ఇదిగో, నీచేతి భోజనం అమృతంలాగుందంటే నమ్మి. మీ పెదనాన్న పుణ్యమా అంటూ ఎంతకాలానికి మళ్ళీతృప్తిగా భోజనంచేశాను! పాపం ఆయనకా కాలు."

"రోడ్డుమీద ఎవరో పిల్లాడు కారుక్రింద పడబోతే, ఆయన పరుగెత్తుకెళ్ళి తీశారు. కారు ఆయన కాలుమీదగా పోయింది."

"పాపం! పుణ్యానికి పోతే మొసలెత్తుకు పోయిందట. మనమేం చేయగలం సుందరీ! అంతా ఆ భగవంతుడి నిర్ణయం."

"నన్ను చిన్నప్పుడినుంచీ ఆయనే పెంచారు. నేనంటే ఆయనకెంతో ప్రాణం. నన్ను విడిచి ఆయన బ్రతకలేరు. అవసరానికని మీదగ్గర ఆ పైకమైనా..." సుందరి కంట నీరు పెట్టుకొన్నది.

"ఆఁ, అదేమిటి సుందరీ? అవసరమనేది ఎంతటి వాళ్ళకైనా వస్తుంది. దానికేంలే వాడి దయే ఉంటే ఐదు వందలు ఐదు క్షణాల్లో సంపాదించగలను. ఇంకా ఏడుస్తానేవున్నావా? పిచ్చిపిల్లా! ఊరుకో సుందరీ, నీ వేడిస్తే నే చూడలేను."

"మీరు చూడనూలేరు, ఆయన బ్రతుకనూ లేరు." దుఃఖం దిగమ్రింగి బండి చక్రాల్లాంటి కాటుక కళ్లు తుడుచుకొన్నది సుందరి.

బొజ్జ నిమురుకొంటూ శాస్త్రిగారు తృప్తిగా నిద్రపోయినారు.

* * *

"శాస్త్రిగారూ! మీరు ఇన్ని ఇళ్ళల్లో పౌరోహిత్యం చేస్తున్నారు గదా, ఎక్కడైనా ఇట్లాంటిది విన్నారా?" అడిగారు శెట్టిగారు తద్దినం పెట్టించడానికి వచ్చిన శాస్త్రిగారిని.

"ఏమిటండీ?" దర్భలు తుంచుతూ శాస్త్రిగారు అడిగారు.

"వద్దురా, అంటే వినకుండా మా తమ్ముడు పాల ఘాటి పిల్లనో దాన్ని చేసుకొన్నాడు.

పెళ్ళయిన మూడో రోజుకే ఆ పిల్లా లేదూ. దాని పెదనాన్న నంటూ వచ్చిన కుంటాయనా లేడూ. పైగా నాలుగు వేల రూపాయిల నగలు గుణ్ణం.”

శాస్త్రిగారి గుండెల్లో రైళ్లు పరిగెత్తినై.

“కుంటాయనా? పాలఘాటి పిల్లా అండీ?” ఆదుర్దాగా అడిగారు.

“మరేనండి, పాలఘాటైతేనేం తెలుగు బాగానే మాట్లాడుతుంది. చెంపక్రిందో మచ్చా అదీనీ.”

శాస్త్రిగారు దర్భలక్కడ పారేసి ఒక్క పరుగుతీశారు. ఇంటి తలుపులు తీసే ఉన్నై.

లోకుల తండ్రులను స్వర్గానికి పంపించే పూచీతో పట్టిన దానాల బాపతు, వైద్యం పేరుతో మోసంచేసి సంపాదించిన బాపతు రెండువేల రూపాయలతో సహా దబ్బ పండు లాంటి తన అదృష్ట దేవత మాయమైపోయింది.

శాస్త్రి గారు దిగులుగా కళ్ళు మూసుకున్నారు.

“నన్ను మరచిపోలేరంటే నమ్మండి” అంటూ ఓ కుంటాయన “నన్ను విడిచి ఈయన బ్రతకలే”రనే ఓ పడుచు పిల్లా కనిపించారు. శాస్త్రిగారు కళ్ళు తెరిచేసరికి అంతా అంధకార బంధురంగా ఉంది.

“అంతా వాడి నిర్ణయం” అంటూ శాస్త్రిగారు కూలబడ్డారు.

# శిథిల దేవాలయం

ఊటుకూరు రంగారావు

భయద ఘోరారణ్య మధ్యప్రదేశాన,
పర్వత సమాన రూపాన నిలబడ్డ, ఓ
శిథిల శిలావృత జీర్ణమందిరమా!
ఏముంది నీ లోన? ఏముంది నీ పైన?
నీ గర్భకుహారమందేముంది– భీకరో
ద్వేగ పూరిత తమోదేవి నాట్యము దప్ప...?
మునుపెన్నడో పాపముల దహించిన, ఫాల
నేత్రుని ప్రాణవిహీన ప్రతిమ దప్ప?
మొద్దువారిన పెద్ద మోటుబండలు, తుంపు
లై, చెదిరిపోయిన ద్వారబంధాలు, మ
హా ఘంటికా రహితమా ధ్వజ స్తంభాలు.
దుశ్ఛేద్య ప్రాకార దుర్గాంతర పిశాచ
ప్రళయ సంగీతార్భటులు దప్ప నీ లోన
ఏమున్నదీనాడు...?
పూర్వ వైభవమున పొందిన ఖ్యాతి, నీ
గర్భగోళాంతర గాఢాంధకార మం
దే, లయమొంది నీ పాషాణ భిత్తికా
శకలాలచాటున అణగి పడిపోయింది.
మానవరక్త పానాసక్త క్రూరసిం
హాలు, వ్యాఘ్రాలు, సంసారాలతోటి, నీ
నీడలందే గొప్ప మేడలను కట్టాయి
నినుజూడ వస్తేను మెడలు కొరికేస్తాయి
పూజలు, నివేదనలు, ప్రోక్షణలులేని, నీ
బూజు పట్టినస్వామితో జతగూడి, ఎ
న్నో కాలసర్పాలు కదలాడుతున్నాయి
పూత్కార రవముతో భూమికంపిస్తోంది.
నీలో ప్రవేశించి నిన్నుద్ధరింప, ఆ
కాలసర్పాలు, వ్యాఘ్రాలను మడియించి
నీ కడుపులోనున్న చీకటిని పోగొట్టి,
నీ ద్వారబంధాలు, నీ ధ్వజస్తంభాలు
నిన్నటిమాదిరి నిలిపి, నీ స్వామికి
ప్రాణప్రతిష్ఠ జరపాలనే యత్నము
చేయు మహాపురుషుడీ యుగంలో లేడు.
ఇది నగ్నసత్యమని నొక్కి చెప్పగవచ్చు.
ఓ శిథిల శిల్పమా! ఓ అంధకూపమా!
ఒరిగిపో! ఒకసారె విరిగిపడు ఫెళ్లున!
వెనుక నీవొక హిమాలయమంత దానివి.
నేడు మా ప్రాణాలకు యమాలయానివి.
నీ మకర తోరణం నేడు మాకురిత్రాడు,
నీ ధ్వజస్థంభాలు గొప్ప ఉరికంబాలు,
నీ మహోన్నత శిల్పమే మృత్యుతల్పము...
శివుడు లేనట్టి ఓ జీర్ణమందిరమా!
చిరకాల మిట్లె వెరపిస్తూ నిలుస్తావా?...
ఎందుకిక, శోభనశియించి తల యెత్తుట?...
కూలిపో! ధరణిపై వాలిపో! కాలచ
క్రాలు నీపై దాడిసాగించక ముందె.
ఓ జీర్ణ దేవళమా! అంధకూపమా!